ISSN 0971-278X

# ప్రజాసాహితి

## సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

ఆగష్టు 2013
వెల : రు. 20/-



# గిడుగు రామమూర్తి @150

362

కథలు : కొ.కు.; సాబిర్ హుస్సేన్; తమ్మినేని అక్కిరాజు

వ్యాసాలు : శ్రీనివాస శిరోమణి; దేవరాజు మహారాజు; ఛాయరాజ్

ఇంకా : జి.యస్. రాంమోహన్; ప్రజాసాహితి నాగరాజు

visit us @ www.prajaasaahithi.com

# ప్రజాసాహితి

జనసాహితి ప్రచురణ

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంపుటి : 37 సంచిక : 1 362 ఆగస్టు, 2013

గౌరవ సంపాదకుడు
నిర్మలానంద

ప్రధాన సంపాదకుడు
కొత్తపల్లి రవిబాబు
సంచారవాణి: 9490196890
ravibabujs@yahoo.co.in

జనసాహితి ప్రధాన కార్యదర్శి చిరునామా:
దివికుమార్,
divikumar1949@yahoo.com
8/28, సిమెంటు ఫ్యాక్టరీ పోస్టాఫీసు వెనుక,
లోటస్ ల్యాండ్, కేదారేశ్వరపేట,
విజయవాడ-520 003
ఇల్లు: 0866-2538890 సెల్లు: 9440167891

రచనలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా
పి.ఎస్.నాగరాజు,
సంపాదకుడు
7-15-17, న్యూ కాలనీ,
ప్రశాంతి విద్యానికేతన్ ఎదురుగా,
శ్రీకాకుళం-532001,
సంచారవాణి: 9441913829

| | | |
|---|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | | రు. 200-00 |
| ఐదేళ్లకు | చందా | రు. 1000-00 |
| సంస్థలకు సం॥ చందా | | రు. 400-00 |

చందాలు పంపవలసిన చిరునామా
ప్రజాసాహితి
30-7-6, అనపర్తివారివీధి
అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం
విజయవాడ-520002
ఫోన్: 9490196890

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

ముఖచిత్రం : గిడుగు రామమూర్తి @150
2వ అట్ట : నాటక సమీక్ష - ఐకా బాలాజీ
3వ అట్ట : స్కెచ్ - 'వి - రాగి'
4వ అట్ట : కవిత - డా॥ రావి రంగారావు

| | | | |
|---|---|---|---|
| సంపాదకీయం-1 | : ప్రజాతంత్ర విలువల ముఖద్వారం-గిడుగు గురజాడల ఉద్యమసారం | | 3 |
| సంపాదకీయం-2 | : అమెరికా ఆశీస్సులకు అర్రులు చాస్తున్న భారత స్వాతంత్ర్యం | | 4 |
| కథలు | : బతుకుతెరువు | - కొడవటిగంటి కుటుంబరావు | 10 |
| | : కామితార్థాలు | - తమ్మినేని అక్కిరాజు | 21 |
| | : నీకి-నాకి | - సయ్యద్ సాబిర్ హుస్సేన్ | 31 |
| గురజాడపై... | : కన్యక-చెల్లీ చెంద్రమ్మ-గుమ్మ | - పి.ఎస్. నాగరాజు | 12 |
| పుస్తక సమీక్షలు | : రైతుకూలీసంఘం వార్షిక సంచిక 2011-12 - భాను | | 35 |
| | : మైనపు బొమ్మలు- సుధాకర్ కవిత్వం- కె. గౌరీశంకర్ | | 42 |
| వ్యాసం | : గిడుగు రామమూర్తి పంతులుగారు | - శ్రీనివాస శిరోమణి | 6 |
| | : చేప ప్రసాదం ఒక మూఢవిశ్వాసం | - దేవరాజు మహారాజు | 17 |
| | : చేపా చేపా ఎందుకు ఎండలేదు? | - జి.ఎస్.రామ్మోహన్ | 19 |
| కవితలు | : శీలా సుభద్రాదేవి (26), వేదన (30), జి.వి.కృష్ణయ్య (32), ఉప్పెన, మేరెడ్డి యాదగిరి రెడ్డి (34), బొమ్మరాత ఎల్లయ్య (39) రాపోలు పరమేశ్వరరావు, పిల్లి మల్లికార్జున్ (41) | | |
| ధారావాహికలు | : పాశ్చాత్య సాహిత్య పరిచయం-36 - మార్క్‌ట్వేన్ రచన : అప్టన్ సింక్లెర్ అనువాదం: ముక్తవరం పార్థసారధి | | 15 |
| | : మానవ సమాజ పరిణామం : 8 - డా॥ ఆర్కే | | 27 |
| బాలసాహితి | : గరిమెళ్ళ సత్యనారాయణ, సి.హెచ్. క్రాంతి, ఎ. ప్రియాంక, కె. కల్పన, మల్లెల చంద్రరావు, కె. సోమేష్, ఎం. లలిత, బి. జగన్నాథరావు | | 23-26 |
| గ్రంథాలయాలు-3 | : అల్లూరి సీతారామరాజు గ్రంథాలయం, ముత్యాలంపాడు, విజయవాడ | | 45 |
| శీర్షికలు | : సాహిత్య పత్రికల ప్రారంభ సంపాదకీయాలు - 'నాస్తిక యుగం' | | 40 |
| | : ముప్పైఏళ్ళ క్రితం ప్రజాసాహితి | | 18 |
| | : చైతన్యవాహిని | | 44 |
| | : ఈ పుస్తకాలు అందాయి కొత్త పుస్తకాలు | | 46 |
| అక్షరనివాళి | : చాగంటి సోమయాజులు | - సింగంపల్లి అశోక్‌కుమార్ | 48 |

డి.టి.పి., కవర్ కలర్ డిజైన్ : ప్రగతి గ్రాఫిక్స్, విజయవాడ

## సంపాదకీయం-1

# ప్రజాతంత్ర విలువల ముఖద్వారం - గిడుగు, గురజాడల ఉద్యమసారం

**ప్రజాసంస్కృతిని** విచ్ఛిన్నంచేసే చదువులు దాపురించాయి. నీతీ నిబద్ధతల్లేని రాతకోతలు రాజ్యమేలుతున్నాయి! సామాజిక విలువల్లేని తెలివితేటలు కల్లోల అభివృద్ధిని ఎండమావులుగా వెదజల్లుతున్నాయి.

వెరసి ఒక ఎరుకమాలిన విద్యావ్యవస్థ దేశాన్ని పట్టిపల్లారుస్తోంది! 66 ఏళ్ళ 'స్వాతంత్ర్యం' ఎదురొచ్చి వెక్కిరిస్తోంది. ఈ నేపథ్యంలో ఇవాళ ఈ 21వ శతాబ్దపు ఇరవైయ్యవపడిలో గిడుగువారి మూడుయాభైల జయంతి స్ఫూర్తిని మననం చేసుకోవడమంటే సమరశీల, చలనశీల, ప్రజామేధావుల పాత్రని సమీక్షించుకోవడమే!

**"సంఘంలో నిరక్షర కుక్షులు ఎక్కువగా ఉన్నంతకాలం సంఘం వృద్ధిలోకిరాదు. సౌఖ్యమన్నది సంఘంలోని భాగ్యవంతులు, పెద్దలు సామాన్య ప్రజలతోపాటు సమానంగా అనుభవించవలసినదేగాని తామొక్కరే అనుభవించవలసినది కాదు. ప్రజలలో విద్య వ్యాపిస్తేగాని, సంఘం వృద్ధిలోకిరాదు"**

(జనవరి 15, 1940 మదరాసులోని 'ప్రజామిత్ర' కార్యాలయంలో గిడుగువారు ప్రకటించిన హెచ్చరిక)

"భాగ్యవంతులైన పెద్దలు తమ ఆరోగ్యం కాపాడుకొనవలెనంటే ప్రజల ఆరోగ్యము కాపాడవలెను" అని కూడా అన్న గిడుగువారి ఆకాంక్షకి ఆరుద్ర ఇచ్చిన వ్యాఖ్యానం - ఆరోగ్యమంటే శారీరక, మానసిక, సాంస్కృతిక ఆరోగ్యమే.

ఆ మూడు ఆరోగ్యాలకూ విద్యా సాంస్కృతిక విధానం యోజనాల దూరంలో కొండెక్కే దీపంలా మినుకు మినుకుమంటోందిప్పుడు.

కూడు, గుడ్డ, గూడు, విద్య, వైద్యం, కళాభిరుచి ఈ కనీస ప్రజా అవసరాలను తీర్చడంలో సొంతలాభం మరిగిన రాజకీయ ముఠాలతో కిక్కిరిసిపోయిన పాలకవర్గాలు పూర్తిగా విఫలమయ్యాయన్నది ఇంగితజ్ఞానం ఉన్న వారెవరూ కాదనలేని ఒక సామాజిక వాస్తవికత.

ఈ నేపథ్యంలో నిజమైన అర్థంలో ప్రజాస్వామిక విలువలకోసం భావజాల రంగానికి రూపమైన భాషోద్యమాన్ని గిడుగువారు - సారమైన సాహిత్యోద్యమాన్ని గురజాడవారు అకుంఠిత దీక్షతో తెలుగునేలమీద ప్రజాదృక్పథంలో నడిపిన చరిత్రనీ, సాంస్కృతిక చలనశీలతనీ ఈ ప్రపంచీకరణ కూడలిలో నిలబడి పునస్సమన్వయించుకోవడమంటే నూతన ప్రజాతంత్ర సాంస్కృతిక పోరాటాన్ని ఆచరణాత్మకంగా పదును పెట్టుకోవడమే! గిడుగు-గురజాడల సమన్వయాన్ని పరిశీలించి చూస్తే ఒకరు భాష-మరొకరు భావం. ఒకరు శక్తి - మరొకరు చలనం. ఒకరు వ్యూహం - మరొకరు ఉద్యమం. ఒకరు కన్ను - మరొకరు చూపు. ఒకరు తెలుగు - మరొకరు వెలుగు. చలనశీలమైన తార్కిక ఐక్యతకు వారిద్దరూ ఒకే దృష్టాంతం.

పేదవాళ్ళకీ, పసిపిల్లలకు, స్త్రీలకు వాళ్ళకు అర్థమైన భాషలో విజ్ఞానబోధన అనేది గిడుగువారి వాడుకభాషావాదానికి ఏకైక లక్ష్యం. అదే అతని జీవితాశయం. ప్రాథమికస్థాయి ఉపాధ్యాయునిగా, కళాశాల అధ్యాపకునిగా, శాసన పరిశోధకునిగా, చరిత్రకారునిగా, సాహిత్య సంశోధకునిగా, సవరభాషా వికాసానికి అంకితమైన భాషాశాస్త్రవేత్తగా, పాఠ్యపుస్తకాల రచయితగా, భాషాభిషక్కుల భేషజాలపై పిడుగులు కురిపించిన పోరాట యోధునిగా, నిఘంటువుల పరిష్కర్తగా - కర్తగా - తెలుగునేల కోసం పర్లాఖిమిడి ఓఢ్రరాజులతో ఎదురురొమ్ముతో ఢీ అంటే ఢీ కొట్టి సవాలుగా నిలిచినా, అనేక సామాజిక, బహిష్కరణలకు గురైనా, కులవెలివేతకి గురైకూడా ఒంటరి పోరాటం నడపడంలో తెగువ కల్గినా - తెలుగు భాష గురించి ఆధునిక పద్ధతిలో ఆలోచించిన మొదటి భాషాశాస్త్రవేత్తగా అలుపెరగని పోరాటంచేసినా, ఆంగ్లభాషమీద ఉడుంపట్టు లాంటి ప్రజ్ఞకల్గివున్నా - సొంతజీతం డబ్బులతో కొండలమీద చదువురాక, లోకజ్ఞానంలేక, అడవి మృగాలవలె తిరుగాడుతున్న అమాయక సవరలకోసం బడులుపెట్టి నడిపించినా - గిడుగువారికి వాదశత్రువులేకానీ, వ్యక్తిగత శత్రువులు లేరు! భాషల చరిత్రల్నీ, సామాజిక చరిత్రల్నీ, సాహిత్య పరిణామాల్నీ - అధ్యయనం చేయడం ద్వారా ఆ జ్ఞానానికి ప్రజాదృక్పథం జోడించడం ద్వారా భాష ఒక 'వర్ణం' చేతిలోది కాదన్న వాస్తవిక దృష్టిని సంతరించుకున్నారు గిడుగువారు. ఆ దృష్టినే పొందిన తమ ప్రత్యక్ష శిష్యుడు తాపీ ధర్మారావు - వీర గ్రాంధికవాదాన్ని వదిలిపెట్టారు. వాడుకభాషోద్యమానికి నడుంకట్టి నిలిచారు. అది బ్రాహ్మణవాదానికి చేయూతకాదని గ్రహించి ప్రజా పోరాటమని అవగాహన చేసుకొని వాడుకభాషా ఉద్యమంలో మమేకమయ్యారు!

సామాజిక పరిణామంలో ఒక భాగమే భాషా పరిణామం అని గిడుగు ఉద్యమం చాటిచెబుతోంది!

భాష-భాష కోసం కాదు!

సాహిత్యం - సాహిత్యం కోసం కాదు!

కళ - కళ కోసం కాదు!

- ఇవన్నీ భౌతిక విజ్ఞానాన్నీ, సామాజిక వికాసాన్నీ, ప్రజాస్వామిక సంస్కారాన్నీ పెంపొందించేందుకు నిలవాలి.

ఈ స్పష్టమైన చూపుని గిడుగు భాషోద్యమం నిరూపిస్తోంది!

**"అధికుల అభివృద్ధిని మనం కోరుకుంటాం. అయితే బడుగు వర్గాలవారు విజ్ఞానవంతులు కావడానికి భాషను సంస్కరించలేమా? భావప్రకటనకు చక్కని వాడుకభాష సరైన వాహిక కాదా? మన పసి వాళ్ళు మంచిసాహిత్యం కోసం పరితపిస్తున్నారు. మన స్త్రీలు స్వచ్ఛమైన స్వతంత్ర రచనల కోసం అలమటిస్తున్నారు"** అని 1919 'తెలుగు' ప్రారంభసంచికలో గిడుగువారు ఆక్రోశించారు.

'తెలుగు' అనే పత్రిక ద్వారా, 'టీచర్' అనే మరో పత్రిక ద్వారా డబ్ల్యూ.టి.ఏట్స్ సహకారంతో - ధ్వన్యాత్మక లిపిలోనూ, ప్రత్యక్ష బోధనా పద్ధతిలోనూ ఉపాధ్యాయులను చైతన్యవంతుల్ని చేయడానికి తీవ్రంగా కృషిచేసారు - గిడుగువారు. అంతర్జాతీయ స్థాయిలో ఈ బోధనా విధానాలు గుర్తింపు పొందాయికానీ, నేటికీ వీటిమీద సరైన సమాచారం గానీ, చర్చగానీ విద్యారంగం చేపట్టలేదు.

దుష్టచతుష్టయంగా పేరుపడిన - గిడుగు, గురజాడ, శ్రీనివాస అయ్యంగార్, డబ్ల్యూ.బి.ఏట్స్‌లు చేసిన విద్యా భవిష్యద్దర్శనం ఈనాడు మళ్ళీ పెనుప్రమాదంలో పడిపోయింది.

ఆనాడు వాడుకభాషా ఉద్యమం కరడుగట్టిన అగ్రకుల పండితుల మూర్ఖత్వంతో పోరాడితే - ఆ ప్రగతిశీల ఉద్యమానికి ఆనాటి బ్రిటీష్

ప్రభుత్వ అధికారులు కొందరు బాసటగా నిలబడ్డారు. ప్రగతిశీల భావాలు కల్గిన ఏట్స్, సి.పి.బ్రౌన్, విలియం కేరీ లాంటి నిజాయితీపరులైన అధికారుల చేయూతని ఇక్కడి సంస్కర్తలు అందుకున్నారు!

యిప్పుడు "ప్రజలభాషలో విద్య-పరిపాలన" కోసం చేసే ప్రజా సాంస్కృతికోద్యమ పోరాటాన్ని సామ్రాజ్యవాదంతోనూ, దానికి తొత్తులైన పాలకవర్గాలతోనూ, పెత్తందారీ గుత్తపెట్టుబడుదార్లతోనూ అలుపెరగకుండా చేయాల్సివుంది.

గిడుగు జీవితం - ఉద్యమం వేరువేరుకాదు. సొంత జీవితంలేని సామాజిక ఉద్యమ వ్యక్తిత్వం ఆయనది. లౌక్యం, గోటూ, గొప్పా లేని ముక్కుసూటి మనిషి గిడుగు!

టాల్‌స్టాయ్ ఆనాడే ప్రభుత్వాలు విద్యా విషయం పట్ల ఎలా ప్రవర్తిస్తాయో స్పష్టంచేసారు.

**"తన బలం, ప్రజల అజ్ఞానంలోనే ఉంటుందన్న విషయం ప్రభుత్వానికి తెలుసు. అందుకే అది ప్రజల నిజమైన జ్ఞానవికాసాన్ని వ్యతిరేకిస్తుంది. ఈ విషయం మనం గ్రహించవలసిన సమయం వచ్చింది. ఒకవైపు అంధకారాన్ని పెంపొందిస్తూ, మరొకవైపు ప్రజలకు జ్ఞానవికాసాన్ని కలిగించడంలో తలమునకలై ఉన్నట్లు ప్రభుత్వం నటిస్తోంది."**

వందయేళ్ళ క్రితం తోల్‌స్తాయ్ చెప్పిన ఈ సత్యాన్ని 1947 నుండి నేటిదాకా సాగుతున్న 'స్వతంత్ర' పరిపాలన అడుగడుగునా రుజువు పరుస్తోంది. 1960 నాటికల్లా దేశంలో నిరక్షరాస్యతను నిర్మూలించేస్తామని చేసిన వాగ్దానం బూటకమై నిజమైన అర్థంలో నూటికి సగంమందిని నిరక్షరాస్యులుగానే మిగిల్చింది. అందరికీ ఒకే బడిని నిర్మించాల్సింది పోయి. 'రెండుగ్లాసుల' విద్యాలయాల్ని (ప్రభుత్వ-ప్రైవేటు) ప్రోత్సహిస్తోంది. మాతృభాషల్లో విద్యను ఉన్నత సాంకేతిక, పరిశోధనా స్థాయిదాకా అభివృద్ధి చేయాల్సిందిపోయి అటు ఇంగ్లీషూ, ఇటు తెలుగూ సరిగా రాని రెంటికి చెడ్డ రేవళ్ళను పెంపొందిచటంతో తలమునకలయి వుంది.

విశాల ప్రజానీకపు ప్రయోజనాల కోసం ఆర్థిక-రాజకీయాల్ని నిర్వహించలేని పాలకులు, పిడికెడు సంపన్నవర్గాల అవసరాలను తీర్చేవిధంగా మాత్రమే విద్య-వైద్యం-సంస్కృతి తదితర వ్యవస్థలను నిర్మిస్తున్నారు. ఇది బడుగుజీవుల, శ్రామికవర్గాల అభ్యున్నతి గురించి మోసపూరిత ప్రకటనలకే పరిమితమై వుంది.

దేశ స్వాతంత్ర్యాన్ని సామ్రాజ్యవాదుల కనుసన్నలకూ, ఆంక్షలూ, ఆదేశాలకూ లోబర్చిన పాలకవర్గాలు దేశభక్తుల ప్రజాస్వామిక స్ఫూర్తినీ, త్యాగాలనూ బూడిదలో పన్నీరుగా మార్చేయటంలో పోటీపడుతున్నారు.

ప్రజల్లో ప్రవహించే చైతన్యం వుంది. జనం రక్తంలో నిప్పు నివురుగప్పివుంది. ఈ నీటితో, ఈ నిప్పుతో చెలగాటాలాడుతున్న పాలకవిధానాలకు విరుగుడుగా - భావజాల రంగంలో గిడుగు - గురజాడల సాహిత్య సాంస్కృతిక భాషోద్యమాలను నూతన ప్రజాతంత్ర విలువలతో సమన్వయం చేసుకోవడం వర్తమాన కర్తవ్యం! ✤

## సంపాదకీయం-2

# అమెరికా ఆశీస్సులకు అర్రులు చాస్తున్న భారత స్వాతంత్ర్యం

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్రం యిలాగే వుండాలా, విడిపోవాలా... అనే వివాదాన్ని తేల్చండంటూ ఢిల్లీ పాదుషాల పీఠం చుట్టూ రాష్ట్రపాలకముఠాలు తిరుగుతున్నాయి. గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రి నరేంద్రమోడీకి వీసా యిప్పించే సాకుతో భాజపా అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్ అమెరికాకు వెడుతున్నాడు. యివ్వద్దంటూ అమెరికా దేశాధ్యక్షుడు బరక్ ఒబామా ముందు భారత పార్లమెంటు సభ్యులు కొందరు లేఖా యాత్రలు చేస్తున్నారు. ఈ రెండు అంశాలూ ఒకే రకమైనవికాకపోయినప్పటికీ అమెరికా గుప్పెటలోకి భారతదేశం జుట్టు మరింతగా దొరికి పోనున్నదనేందుకు ముందు సూచనగా దీన్ని పరిగణించవచ్చు. 1949లోనే ఆరుద్ర చెప్పినట్టు 66ఏళ్ళ భారత స్వాతంత్ర్యం మేడి పండేనని మళ్ళీ మళ్ళీ రుజువవుతోంది.

అమెరికా ప్రభువులకు ఆమోదయోగ్యం కానివారు భారత ప్రధానిగావటానికి అర్హులుకాలేరు. 2005 సంవత్సరంలో నరేంద్రమోడీని అమెరికా దేశానికి రానివ్వకుండా 'వీసా'ను అమెరికా ప్రభుత్వమే రద్దుపరిచింది. ఇప్పటికీ వీసా పునరుద్ధరణ జరగలేదు. 2002లో గుజరాతు రాష్ట్రంలో గోద్రా సంఘటనల సాకుతో అక్కడి ముస్లిములపై జరిగిన దారుణ ఘోరాలూ, ముస్లిం మహిళలపై సాగిన హత్యాచారాలను రాష్ట్రముఖ్యమంత్రిగా వుండిన మోడీ అరికట్టలేకపోగా, అవన్నీ సాగించిన సంఘపరివార శక్తులకు అప్రకటిత యధేచ్ఛను కల్పించాడనే అభియోగం ఒక్క భారతదేశంలోనే కాదు. నోబుల్ బహుమతీ గ్రహీత, 'భారతరత్న' అమర్త్యసేన్‌తో సహా ప్రపంచవ్యాపితంగా అత్యధికులు నాటికీ, నేటికీ నమ్ముతూనే వున్నారు. మోడీ తన అధికారబలంతో చట్టానికి దొరకకుండా నిజాల్ని, సాక్ష్యాల్ని తల్లకిందులు చేయవచ్చునుగాక, సంఘ పరివారశక్తులు కార్పొరేట్ మీడియా బలంతో మోడీ మీద చిందిన రక్తపు మరకలను తుడిపించే ప్రయత్నం చేయవచ్చునుగాక. కానీ నిజమనే నిప్పుని ఆర్పేయలేరుగదా!

"నాడు గుజరాత్‌లో ముస్లిములపై జరిగిన ఘోరాలకు, రాష్ట్ర అధినేతగా పశ్చాత్తాపం ప్రకటిస్తారా?" అని వేసిన సూటిప్రశ్నకు "నా కారుకింద కుక్కపిల్ల పడినా నేను బాధపడతాను" అన్నాడే తప్ప ప్రజలను క్షమాపణ మాత్రం కోరలేదు. ఇది అతనిలో కరుడుగట్టిన ద్వేషతత్వానికి నిదర్శనం. భారతదేశపు అత్యున్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) నరేంద్రమోడీని 'నీరో' చక్రవర్తి అంది. ఆనాటి దేశ ప్రధానమంత్రి, భారతీయ జనతాపార్టీ నాయకుడైన వాజ్‌పాయే "రాజధర్మాన్ని అతిక్రమించినవాడు"గా మోడీని అభివర్ణించాడు. బలహీనులను, అమాయకులను, స్త్రీ, బాల, వృద్ధులను బలవంతుల నుండి, సంఘవ్యతిరేక శక్తుల నుండి కాపాడవలసిన బాధ్యత రాజ్యాన్నేలే పాలకులదేనని తరతరాల భావన. మోడీకి సంఘపరివారంలో సంఘ వ్యతిరేకశక్తులు కనపడవు. హిందూత్వ శక్తులకు కొందరు ముస్లిములుగా జన్మించి వుండటమే సాంఘికనేరం. కనుక వారు శిక్షార్హులుగా హిందూత్వశక్తులు నమ్ముతాయి.

మోడీ కుక్కపిల్ల ఉదాహరణనిచ్చాడు కనుక 'మహాభారత'ంలో మొదటి అధ్యాయంలోని ఒక ఉదంతం పేర్కొనాల్సి వుంది. ఏ అకృత్యమూ చేయకున్నా సారమేయుడనే కుక్కపిల్లను జనమేజయ మహారాజు తమ్ముళ్ళు కొట్టారు. కుక్కపిల్ల తల్లి - సరమ - కొట్టిన తమ్ముళ్ళను కాకుండా జనమేజయ మహారాజునే శపిస్తుంది. కారణం బలహీనులను కాపాడవలసిన ధర్మం రాజుది కనుక.

గుజరాతు మారణకాండ జరిపిన సంఘపరివార శక్తులను నరేంద్రమోడీ ఉసిగొల్పాడనే ఆరోపణను పక్కనబెట్టినా సంఘవిద్రోహ శక్తులను అదుపుచేసి, అమాయకులను, బలహీనులను కాపాడాల్సిన బాధ్యత ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిదే కదా! జలియన్‌వాలాబాగ్‌లో జనరల్ డయ్యర్ జరిపిన మారణకాండకు 80ఏళ్ళ తర్వాతనైనా బ్రిటీషు రాణి క్షమాపణ ప్రకటించలేదా?

నరేంద్రమోడీ దేశప్రధాని కావటం పట్ల ముస్లిములకూ, దళితులకూ, కమ్యునిస్టులూ, శ్రమజీవులకూ సహజంగానే వ్యతిరేకత ఉంటుంది. పాలకపక్షాలయిన కాంగ్రెసుతోపాటు, భాజపా నాయకత్వాన గల ఎన్.డి.ఎ.కు, చివరాఖరుకు భాజపాలోని (అద్వానీ లాంటి) కొన్ని ముఠాలకు కూడా అంగీకారం లేకుండా వుంది. 2014 ఎన్నికలలో రాహుల్‌గాంధీని దేశప్రధానిగా చేయాలనే ఆదుర్దాలో వున్న కాంగ్రెసు వాదులను (ముస్లిం) బుర్ఖా లౌకికవాదులని మోడి విమర్శిస్తే, 'నగ్నం'గా ముస్లిం ద్వేషాన్ని ప్రదర్శించేకంటే ఏదో వొక ముసుగైనా వుండటం మేలేకదా అని కాంగ్రెసువారు ప్రకటించుకుంటున్నారు. ఆ విధంగా భాజపేయుల ముస్లిం ద్వేషతత్త్వమూ, కాంగీయుల కుహనా లౌకికవాదమూ బహిర్గతమైనాయి. అంతటితో ఆగిపోలేదు. వారి వారి భాషా దృక్పథాలు కూడా బయటపడ్డాయి. నేటి ప్రపంచీకరణకు ఇంగ్లీషులో చదువులు తప్పనిసరి అని కాంగీయులూ, సంస్కృతాన్ని విస్మరించటం, దేశం మేధోపతనానికి కారణమని సంఘపరివార్లూ పరస్పరం విమర్శించుకున్నారు. ఇది వారిరువురి 'దేశభక్తి' 'ప్రజాస్వామి'క తత్త్వం ఎంత డొల్లతనం గలదో బహిర్గతపరుస్తుంది. దేశీయ ప్రజల భాషలపట్ల ఇరువురికీ ఎంత చిన్నచూపో బ్రిటీషు సామ్రాజ్యవాదులు రుద్దివెళ్ళిన ఇంగ్లీషుపట్ల ఒకరికీ, రాచరిక యుగపు పండితుల భాషగా తప్ప ఏనాడూ ప్రజల భాషకాని సంస్కృతం పట్ల మరొకరికీ గల వ్యామోహాలను తేటతెల్లం చేస్తున్నాయి.

66 ఏళ్ళ స్వాతంత్ర్యం తర్వాత కూడా దేశప్రజలు ఎంత దారిద్ర్యంలో చిక్కుకుని వున్నదీ, మరీ ముఖ్యంగా ఇటీవలి సామ్రాజ్యవాద ప్రపంచీకరణం తర్వాత పేదరికం పెరిగిపోతున్న సంగతీ మనం అనుభవపూర్వకంగా గ్రహిస్తున్నదే. ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చటానికి దారిద్ర్యరేఖకి దిగువన గలవారు తగ్గిపోతున్నారన్నట్లు కాకుల లెక్కొకటి నేషనల్ ప్లానింగ్ కమీషన్ విడుదల చేసింది. గ్రామీణులయితే రోజుకి 27.2 రూపాయలకు పైబడిన సంపాదనగలవారూ, పట్టణాల శ్రామికులయితే రోజుకు రూ 33.3కు పైబడిన సంపాదన కలవారూ దారిద్ర్యరేఖకు పైనున్నవారిగా లెక్కించి, ఆవిధంగా దారిద్ర్యాన్ని అంకెలలో తగ్గించేశారు. వారిచ్చిన ఆర్థిక గణాంకాల లెక్కన పది సంవత్సరాల్లో ఈ దేశంలో సంపూర్ణ దారిద్ర్య నిర్మూలన జరిగిపోతుందట!! ఒక వైపున గ్రామాల్లో సంవత్సరానికి 60 రోజులకంటె పనులు దొరకటంలేదని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. మరొకవైపున అడవుల్లో, గ్రామాల్లో ఆదివాసీలు, రైతుకూలీలు, దళితులు సెజ్జులపేరిట దిక్కులేనివారిగా మారి, వలసల మీద వలసలకు ఊళ్ళొదిలి పోవాల్సిన స్థితి వుంటే, పట్టణాలూ, నగరాల్లో అభద్రతా, వెట్టిచాకిరీ తప్ప కనీస వేతనచట్టాలను అమలుపరచని క్రూర శ్రమదోపిడీ విధానాలు అమలు జరుగుతుంటే... వీరిచ్చిన దారిద్ర్య నిర్మూలన లెక్కలు ఎవరిని నమ్మించటానికీ? గత 7 సంవత్సరాల కాలంలో (2004-05 నుండి 2011-12 వరకు) 15.3% శాతం జనాభా (సుమారు 18కోట్ల మంది) దారిద్ర్యరేఖకు ఎగువకు చేరారని చెబుతున్నారు. సరిగ్గా ఈ కాలంలో ఇంటద్దెలూ, విద్య, వైద్యం, విద్యుత్తు, ఆహారపదార్థాల ధరలు ఎంతెంత పెరిగి పోయినాయో, నిజ జీవితంలో రూపాయి విలువ (డాలర్ మారకంలో పతనం కంటె) ఎంత కుప్పకూలిపోతోందో లెక్కిస్తే... దారిద్ర్యం తరుగుతోందన్నది బూటకమనీ, నిజానికది ఇంకా... ఇంకా పెరుగుతోందనీ గ్రహించ గలుగుతాము. ఇక గుజరాత్ విషయానికొస్తే 1980-81లో కంటె 1990-91లో 2.9శాతం, 2000-01లో కంటె 2008-09లో 8.1శాతం, 2005-06లో కంటె 2009-10లో 2.2శాతం ప్రజల కొనుగోలు శక్తి పడిపోయింది. గుజరాత్‌లోని భావనగర్ విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాస్త్రవేత్తా, ఉపకులపతి ఐన విద్యుత్ జోషి ప్రకారం "గుజరాత్‌లోని 5ఏళ్ళలోపు పిల్లలలో సగంమంది పౌష్టికాహారలోపంతోనూ, నాల్గింట ముగ్గురు రక్తహీనతతోనూ వున్నారని "యునిసెఫ్" 2012నాటి నివేదికలో ప్రకటించింది. ప్రతి వెయ్యిమంది పురుషులకూ 921మంది స్త్రీలు 2001లో వుండగా 2011నాటికి 919కి తగ్గింది. అదే పసిపిల్లలలో ఆడపిల్లలు 2001లో 964కాగా 2011కు 890కి దిగజారిపోయింది."

అంతేకాదు విద్యార్థులు 100మంది కంటె తక్కువగావున్న కారణంగా రాష్ట్రవ్యాపితంగా 7000 గ్రామీణ పాఠశాలలను గుజరాతు రాష్ట్రప్రభుత్వం మూసేసింది. ఇక వేతనాల విషయానికొస్తే అసంఘటిత కార్మికులకు కేరళరాష్ట్రంలో రోజుకూలీ రూ.218/-దాకా వుండగా గుజరాత్‌లో రూ.106/- మాత్రమే లభిస్తోంది.

అయితే ఈ దారిద్ర్య గణాంకాలు గుజరాత్ రాష్ట్రానికి వర్తించవని గుడ్డిగా నమ్మేవాళ్ళున్నారు. నరేంద్రమోడీ ప్రచార ప్రభావంతో ఒక తెలుగు మాసపత్రిక యిలా రాసింది. **"ఎక్కడా అవినీతిగానీ, నిరుద్యోగం గానీ, అసంతృప్తిగానీ, కార్మిక సమస్యలుగానీ, లేని రాష్ట్రం ప్రపంచంలో ఎక్కడైనా ఉందంటే అది గుజరాత్ మాత్రమే!"** దీని ప్రకారం అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా కూడా నరేంద్రమోడీని చూసి సిగ్గుపడాల్సిందే. అయితే అమెరికా ఆశీస్సులు లేకుంటే దేశప్రధాని కాలేడు కనుక భాజపా అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్ లాబీయింగ్ ద్వారా అమెరికా రాజకీయులలో మోడీపట్ల ఆమోదాన్ని సాధించాలనే ప్రయత్నంలో భాగంగా అమెరికాకు బయల్దేరాడు. పైకి వీసాపై నిషేధాన్ని రద్దుచేయించుకునే ప్రయత్నమన్నట్టు కనిపించినా, ఈ యాత్ర సాగుతున్నది సామ్రాజ్యవాద ప్రభువుల ఆశీస్సులకే. బహుళజాతి కంపెనీల ప్రయోజనాలను నిరంకుశంగా కాపాడటంలో, అమెరికా సామ్రాజ్యవాదుల దురాక్రమణ యుద్ధాలకు మద్దతునీయటంలో కాంగ్రెసు పాలకులకు తాము ఏమీ తీసిపోమని, కావాల్సిన హామీనిచ్చి తగిన మద్దతును పొందటానికే వెళ్ళారు. చైనాలో చాంగ్‌కై షేక్ కీ, ఇండోనేషియాలో సుహర్తోకూ, చిలీలో పినోచెట్‌కూ, ఫిలిప్పీన్స్‌లో మార్కోస్ లాంటి పరమక్రూరులకు మద్దతునిచ్చి పెంచి పోషించి కాపాడిన అమెరికా సామ్రాజ్యవాదంకు మోడీని భారతప్రధానిగా నిరాకరించాల్సిన అభ్యంతరాలుండే అవకాశం వుందా?

**- 25.7.2013**

**End of Preview.**

**Rest of the book can be read @**

[http://kinige.com/kbook.php?id=1992](http://kinige.com/kbook.php?id=1992)

* * *

**Read other issues of Praja Sahiti Magazine@**

[http://kinige.com/kbrowse.php?via=author&id=58](http://kinige.com/kbrowse.php?via=author&id=58)